

# అత్తయ్య

'కరుణారుణ'

**మమ్మల్ని** పెంచి పోషించింది మా నాన్నే అయినప్పటికీ మామయ్య ఎప్పటి కప్పుడు ఆదుకోక పోయినట్టయితే ఈనాడు మేమీ స్థితిలో ఉండేవాళ్ళం కాము.

నాన్న పూర్ణ స్కూల్ టీచర్. ఆ రోజుల్లో టీచర్లంటే కాస్త గౌరవం, అభిమానం ఇంకా ఉండేవి. బహుశా అందువల్లే మేం మొత్తం అయిదు గురం సంతానమైనప్పటికీ పేదరిక మంటే ఏమిటో తెలియకుండా పెరిగాం. స్కూల్లో చెప్పిన పాఠాలు గాక నాన్న ఇంట్లో ట్యూషన్లు కూడా చెప్పే వాడు. ట్యూషన్లంటే ఇప్పట్లా కాదు. మేం రేషను తెచ్చుకునే కోమటి సుబ్బయ్య పిల్లలిద్దరు (మొద్దులు), పెద్ద కామందు మల్లయ్య చిన్న కొడుకు, డిప్యూటీ తాసిల్దారు నాయుడు గారబ్బాయి—వీళ్ళంతా స్కూలు కాగానే మా ఇంటికి వచ్చి ముందర గదిలో చాప పరుచుకుని కూర్చునేవారు. నాన్నకు చాలా మంచి టీచర్‌గా పూర్ణ పేరుం దని తరువాత తెలిసింది. అంత మంచి టీచరైన నాన్న ఎంతకూ ఒక్క అక్షరమున్నక్కయినా అర్థంగాని పిల్లలకు గంటల తరబడి ఎంత ఓపిగ్గా లెక్కలు, ఇంగ్లీషు, తెలుగు వ్యాక రణం చెప్పేవాడో తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

ఈ ట్యూషన్లు వాళ్ళెవరూ డబ్బు లిచ్చేవారు కారని అమ్మ అనడం నాకు జ్ఞాపకం. కాకపోతే కోమటిసెట్టి అరువు పెట్టేవాడు. మల్లయ్య పొలంలో కెళ్ళి కూరగాయలూ, తమలపాకులూ తెచ్చు కునేవాళ్ళం. ఇప్పుడు ఇంత చదువుకుని, మంచి ఉద్యోగం చేస్తూ కూడా ఆపస రానికి పద్దికి తప్ప చేబదులుగా వంద రూపాయలు పుట్టించలేని నా అవస్థ చూస్తుంటే, నాన్నకు పూర్ణ మంచి పలుకుబడి ఉండేదనే అనిపిస్తుంది. అప్పుడు నాన్నకు డెబ్బయి అయిదు రూపాయల జీతం. అందులో ఏదో, పదిహేనో అద్దెకు పోయేది. అదీగాక ఇంట్లో ఎప్పుడూ ఇద్దరికి తక్కుండా చుట్టాలుండేవారు. అమ్మకు తరుచు అనారోగ్యం, ఉబ్బసం, డయబిటిస్. అమ్మ మంచం పట్టగానే నాన్న

# ఓ.ఓ.బి బ్లూ డిటర్జెంట్ పౌడరు
# చాలా తక్కువ ఖర్చుతో
# మీ బట్టలకొక ప్రత్యేక చలువ
# ఇవ్వడానికి-

ఓ ఓ బి బ్లూ డిటర్జెంటు వాషింగు పౌడరు నురుగులో తెల్లదనం ఇచ్చే ఓ ప్రత్యేక పదార్థమున్నది. తళతళలాడే మీ బట్టల తెల్లదనానికి, లాండ్రీ వుతుకులాంటి కొత్తదనానికి, మరియు మీ బట్టల సురక్షితానికి, ఈ ప్రత్యేక పదార్థమే కారణము.—




అల్ట్రా మెరైన్ అండ్
పిగ్ మెంట్సు
లిమిటెడ్
రాణిపేట,
తమిళనాడు

కేవలము
బట్టకి నాలుగు
పైసలే!

# ఓ.ఓ.బి
# బ్లూ డిటర్జెంట్ పౌడరు

Sista's-UPL-82 A 81-Tel




ఏంటేంటి చార్జీ తీసుకుని మాకు పనులు పురమాయిస్తూ హడావిడి చెయ్యటం వూహించుకుంటే ఇప్పుడు సరదాగా ఉంటుంది.

మామయ్య వచ్చినప్పుడల్లా మాకోసం బొమ్మలూ, మిఠాయి డబ్బాలూ అమ్మకు వండుగా (వూళ్లో దొరకని: తెచ్చేవాడు. ఆయన ఇంట్లో ఉన్న న్నాళ్ళూ మాకు కథల విందు. వెళ్ళేటప్పుడు అమ్మా, నాన్నా వద్దంటున్నా సరే, తలా రెండు రూపాయల నోటు చేతిలో పెట్టి పోయేవాడు. జేబులో ఎప్పుడూ అయిదు పైసలకన్నా ఎక్కువ పాకెట్‌మనీ ఉండని మాకు రెండు రూపాయల నోటు పట్టుకుంటే ఎంత గర్వంగా ఉండేదో! కాని ఏం లాభం? మామయ్య ఇల్లు దాటగానే, 'పిల్లల దగ్గిర డబ్బు లుండటం మంచిదికాదురా' అంటూ అమ్మ ఆ డబ్బులన్నీ లాగేసుకునేది.

మామయ్యకు పెళ్ళయినప్పుడు నాకు ఆరేళ్ళు. పెళ్ళికి నాకు కొత్త గుడ్డలు లేవని తెలిసి మామయ్య నన్ను గుడ్డలషాపుకు తీసుకెళ్ళి రెడీమేడ్ చొక్కా, నిక్కరూ కొనిచ్చాడు.

అత్తయ్య సంగతి అప్పుడేం తెలుసు గాని ఆమెను చూడగానే భయం వేసినట్టు మాత్రం జ్ఞాపకం. పెళ్ళి తర్వాత మొదటిసారి మామయ్యా, అత్తయ్యా కలిసి వచ్చి మా ఇంట్లో వారం రోజు లున్నారు. వాళ్ళు అప్పుడు వదలిపోయిన వాసన మూనె సీసాలు, టూత్‌పేస్టు ట్యూబులు, ఖరీదైన సిగరెట్ పాకెట్స్ (నాన్న ఎప్పుడన్నా బీడీలు కాల్చేవాడు) మాకు ఆట వస్తువులుగా మారేయి. వాళ్ళున్న వారం రోజులూ మాకు ముందరి గది లోనే మకాం. అమ్మ వరండాలో పడుకునేది. దేవుడి గది పక్కనున్న చిన్న గది వాళ్ళకు ప్రత్యేకం. చారూ, పచ్చడీ తప్ప మంచి కూరగాయులన్నైనా ఎరగని మాకు, వాళ్ళ పుణ్యాన రోజా పిండి వంటలు, పళ్ళు కూడా ప్రాప్తించాయి.

ఒకనాడు ఉదయం నే నింకా లేవలేదు. ఎందుకోగాని అమ్మా, అత్తయ్యా పోట్లాడుకున్నారు. పెద్ద పోట్లాట. ఇద్దరూ శోకాలు పెట్టి ఏడ్చారు. నాన్న అమ్మను తిట్టాడు. ఆ తర్వాత అరగంటలో అత్తయ్యా, మామయ్యా తమ పెట్టెలు సర్దుకుని ఇంటి ముందరికి జట్కాబండి రాకుండానే నడిచి వెళ్ళిపోయారు. ఆ తర్వాత నాన్న అమ్మను కొట్టటం, అమ్మ రెండు రోజులు భోజనం మానేసి ఒక మూలన పడుకోవటం నాకు గుర్తు.

మరి కొన్నాళ్ళకు గాని అసలు సంగతి తెలియలేదు. మామయ్య వచ్చిన రోజునే ఖర్చులకు ఉంచమని అమ్మకు వంద రూపాయ లిచ్చాడు. అందువల్లే రోజూ మేం స్వీట్లు, పూరీలు వగైరా ఆరగించ గలిగాం. ఒకసారి సరదాగా మాట్లాడు కుంటున్నప్పుడు అత్తయ్య, 'రోజా ఇవన్నీ ఎందుకు చేస్తున్నా రొదినా—అనవసరమైన ఖర్చు' అందట. 'మేమేం పెడుతున్నామమ్మా—మీ రిచ్చిందేగా' అందట అమ్మ. తనకు తెలియకుండా మామయ్య అమ్మకు డబ్బు లివ్వటం అత్తయ్య సహించలేకపోయింది. ఫలితం పోట్లాట.

వీలైనప్పుడల్లా ఎదటి వారికి సహాయం చెయ్యటం మంచివాళ్ళ లక్షణం. పక్క మనిషికి సహాయం అవసరమైనప్పుడల్లా వీలు కలిగించుకోవటం మామయ్య ప్రత్యేకత. అట్లాగని ఆయన ఎంతో గంభీరంగా—ఋషిలాగా ఉంటాడేమోననుకుంటారేమో అదేం కాదు. ఆయన ఎంత సరదాగా జోక్స్ వేస్తూ, నవ్విస్తూ ఉంటాడో చూడాల్సిందే గాని చెప్పలేను. లోపల ఎన్ని బాధ లున్నాసరే, ఆయన పెదవుల మీద చిరునవ్వు మాయదు. బహుశా, మామయ్యకున్న ఈ ఉదార గుణంవల్లే ననుకుంటాను భార్యా భర్త లిద్దరికీ ఎప్పుడూ పడేదికాదు. తన మొగుడి సంపాదన అందరికీ పంచి పెడుతున్నాడని అత్తయ్య బాధ. ఇంట్లో ఆమె చండికలాగ ఉండేదని మా ఇంట్లో అనుకోవటమేకాదు, నేను స్వయంగా చూశాను. వేసవికాలం సెలవులు రాగానే హైదరాబాదు చూస్తామని పెద్ద పిల్లలం ముగ్గురం మామయ్య దగ్గరికి వెళ్ళేవాళ్ళం. అమ్మా, నాన్నా వద్దన్నా సరే, మామయ్య స్వయంగా వచ్చి మమ్మల్ని మరీ తీసుకెళ్ళేవాడు.

ఇంట్లో అత్తయ్య ఏమీ చేసి పెట్టకపోయినా మామయ్య రోజా ఏదో ఒక చిరుతిండి తీసుకొచ్చేవాడు. సర్కసులకూ, సినిమాలకూ, పార్కులకూ తీసుకెళ్ళేవాడు. అత్తయ్య కోపంతో కాసేపు అరిచి, మొహం మాడ్చుకునేది (ఆమె కోపం తెచ్చుకుని వెంట రానప్పుడు మాకు మరీ బావుండేది). బయట పల్లీలు, బఠానీలు, చాక్లెట్లు, బిస్కట్లు—ఏవి అడిగితే అవి కొనిచ్చేవాడు మామయ్య.

అవీ నా చిన్నప్పటి అనుభవాలు.

నేను ఎనిమిదో క్లాసులో ఉండగా

మా పెద్దక్కయ్య పెళ్ళి కుదిరింది. నాలుగు వేలు కట్నం కావాలన్నారు. నాన్న అంత వీలుపడదన్నాడు. "డబ్బు కోసం చూసుకుంటే పిల్లల పెళ్ళి ళ్ళెట్లా అవుతాయి?" అన్నాడు మామయ్య. 'కాదు కూడదంటే మరో ఐదు వందలు తేగలనేమో. అంతకు మించి పైసా కూడా నావల్ల కాదు. అది నాన్న పట్టు. 'మిగతా డబ్బు నేను సర్దుబాటు చేస్తాను' అన్నాడు మామయ్య. నాన్న కంట తడిపెట్టు కున్నాడు. మామయ్య వోదార్చాడు. ఇంట్లో ఎంత గొడవ చేసిందో మాకైతే తెలియదు గాని, ఆ పెళ్ళికి, ఆ తర్వాత ఇద్దరు అక్కయ్యల పెళ్ళిళ్ళకు కూడా అత్తయ్య రాలేదు. తన ఇద్దరు పిల్లల్నీ తీసుకుని పుట్టింటికి వెళ్ళి కూర్చుంది.

అమ్మా, నాన్నా చెప్పారు—'ఒకరికి సాయం చెయ్యబోయి ఇంట్లో పొర పొచ్చాలు తెచ్చుకోకు, బాబూ' అని. కాని మామయ్య వినేరకం కాదు. ఎవరి కైనా సాయం అవసరమైతే మొదట చెయ్యాల్సిందే. తరువాతే ఇంటి సంగతి.

మరి కొన్నాళ్ళకు నేను స్కూలు చదువు ముగించుకుని పి.యు.సి. కోసం హైదరాబాద్ వెళ్ళినప్పుడు) అప్పటికే నాన్న రిటైరై పోయారు. మామయ్య నన్ను తన వద్దే ఉండి చదువుకొమ్మ న్నాడు. కాని వాళ్ళింటి పరిస్థితి బాగా అర్థం కాలేదు.

మామయ్య తన బంధువులకూ, స్నేహితులకూ చేసే విర్వాకాలకు శిక్షగా నేమో అత్తయ్య ఆయ న్నెన్ని తిప్పలు పెట్టాలో అన్నీ పెట్టేది. 'గతి లేని ఇంటినుంచి వస్తే ఇలాగే ఉంటార్రా! ఒకరికి ఒక పైసా ఇస్తే వోర్వలేరు' అనేది అమ్మ.

నిజమే. ఆమె పుట్టింటి వాళ్ళు బీదవాళ్ళు. బ్యాంకు ఉద్యోగంలో ఉన్న మామయ్యకు ఎన్నో మంచి సంబంధాలు వచ్చినా పట్టు పట్టి కావాలని పేదింటి పిల్లనే చేసుకున్నాడు. ఇప్పుడు అనుభవి స్తున్నాడు. ఆడవాళ్ళకు పుట్టింటి మీద మమకారంఉంటుందంటారు.కాని ఆమెకు అదికూడా లేదు. ఇంటికి ఎవరొచ్చి తిని పోయినా, ఇల్లుగుల్ల చేస్తున్నారనే అను కునేది. చివరికి సొంత తల్లినైనా సరే ఆ ఇంట్లో ఒకటి రెండు రోజులకన్నా ఎక్కువ ఉండనివ్వక పోయేది.

అలాంటి మనిషి దగ్గర నేనుమూడేళ్ళు ఎలా గడిపి ఉంటానో మీరే వూహించు కోండి. ఇంటి ఖర్చులకు మామయ్య ఇచ్చిన డబ్బులన్నీ చీటీలు కట్టి పదిహేను రోజులకే అయిపోయాయనేది. నెల సామాను కొనడానికి మామయ్య వెంట వస్తానంటే వద్దని మరుతక బియ్యం కొనుక్కొచ్చేది. ప్రతి నెలా జీతం వచ్చిన రోజున పెద్ద తగాదా. లెక్క అడిగేది. జేబు ఖర్చుకు రోజుకు అర్ధ రూపాయి కన్నా ఎక్కువ ఇవ్వనేది. తనకన్నా ఎంతో తక్కువ సంపాదిస్తున్న వాళ్ళు కూడా ఎంతో హాయిగా, సుఖంగా బ్రతుకుతున్నా ఆవిడ మాత్రం రోజూ సాయంత్రం ముగిగిన పుచ్చిన కూర గాయల కుప్పలు కొని తెచ్చేది. పెరు గంటే ఎలాంటిదో వాళ్ళింట్లో తెలి యదు. ఎప్పుడు చూసినా నీళ్ళమజ్జిగే. ఇక గుడ్డలంటారా—తనకుకాని, పిల్లలకు కాని, మామయ్యకు కాని మంచి బట్ట లేసుకోవడం నొసట రాసి లేదనుకోవాలి. మునిసిపాలిటీ స్వీపర్లు కట్టుకునే చీర ల్లాంటివి తనకూ కాటన్ చొక్కాలు పిల్లలకూ. దుస్తులన్నీ చిరుగు పాత వైనా సరే, అవే మళ్ళీ మళ్ళీ కుట్టి మామయ్యకు తొడిగించేది.

ఇంట్లో పని మనిషి లేదు. అన్నీ తనే చేసుకునేది. క్రితం రోజు మిగిలిన వంటకాలను ఆ రోజు వండిన వేడి పదార్థాలతో కలిపి అందరూ తినాల్సిందే. అదీ ఆమె పొదుపు.

కుతూహలం కొద్దీ కొన్ని సార్లు ఆలోచించే వాణ్ణి. ఆవిడ కెందు కింత పిసినారితనం? తను సుఖపడక, పిల్లల్ని, మొగుణ్ణి సుఖ పెట్టక ఎందు కిలా బికారిలా బతుకుతున్నది? ఎవరి కోసం! ఆవిడ లక్ష్యమేమిటి? గమ్య మేమిటి?

చివరికి మామయ్య ఇరవయ్యేళ్ళ సర్వీసు తరవాత ఇల్లు కట్టించా లను కున్నప్పుడు గాని ఆ రహస్యం బయట పడలేదు. అప్పటి దాకా అత్తయ్య చేసిన పొదుపు ఒకెత్తయితే, ఇల్లు కట్టించా లనుకున్నాక ఆవిడ చేసిన పొదుపు ఒకెత్తు. నా అదృష్టం కొద్దీ అప్పుడు నేను వాళ్ళింట్లో లేను. ఒంటి పూట భోజనమే చేశారో, మంచినీళ్ళు తాగి కడుపు నింపుకున్నారో నాకు తెలియదు. కాని అంతటి వోపిక గల మామయ్యకు కూడా జీవితం మీద విరక్తి కలిగి ఉంటుందని నా అనుమానం.

ఆ ఏప్రిల్—మేనెల ఎండల్లో ఆవిడ స్వయంగా రోజంతా సైట్ దగ్గర నిలుచుండి, ఏ మేస్త్రీ కూడా చేయించ లేనంత బాగా కూలీల చేత పని చేయిం చింది. మామయ్యకు వచ్చిన హౌసింగ్ లోన్ సరిపోక వడ్డీలకు తేవాలనుకున్న ప్పుడు తను ఆదా చేసిన డబ్బు కొద్ది కొద్దిగా మామయ్య కిచ్చినంత పని చేసి 'ఇదిగో—ఈ డబ్బుతో కట్టించిన ఇంటి









మీది అద్దె నేనే తీసుకుంటాను' అంది. అలా సుమారు ముప్పై వేల రూపాయలు మామయ్య కిచ్చింది.

ఇల్లు తయారయ్యాక గర్వంగా అత్తయ్య, 'ఈ భాగం నాది' అంది.

"పిచ్చిదానా, ఇల్లంతా బ్యాంకు పేర మార్టిగేజ్ అయి ఉంది. లోను తీర్చితేనే ఇది నాదీ, నీదీ" అన్నాడు మామయ్య. అత్తయ్య తన జ్ఞానమంతా ఉపయోగించి —"లోను వాయిదా రెట్టింపు కట్ చేయించుకోండి. త్వరగా తీరి పోతుంది" అంది.

ఆ పరిస్థితుల్లో ఇంకా పొదుపు చెయ్యటానికి వీలు పడుతుందా అంటే ఆవిడకు వీలు పడుతుంది. గృహ ప్రవేశానికి ఏం పిలిచారో గాని ఆ తర్వాత మాకూ, వాళ్ళకూ రాకపోకలు కూడా తగ్గిపోయాయి. మామయ్యకు కూడా ఆ లోనూ, ఈ లోనూ తీసుకోవడంతో జీతంలో 'కోతలు' పెరిగాయి. 'గ్రాస్' సాలరీ 2 వేల పైచిలుకు ఉన్నా 'నెట్'గా అంతా:దు వందలు వచ్చేది.

ఈలోగా మామయ్య పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. నాకు మామయ్య దయవల్ల ఆ బ్యాంకులోనే ఉద్యోగం దొరికింది. మామయ్యకు ఆఫీసులో 'వంటింటి కుందేలు'గా పేరు ఉందని అప్పుడే తెలిసింది. ఆఫీసులో పార్టీలైతే డబ్బులివ్వడు. ఒకడికి ఒక కప్పు కాఫీ తాగించడు. అందుకు కారణం ఆయన పిసినారితనం కాదు — ఆర్థిక విషయాలు ఆవిడ అజమాయిషీ చెయ్యటమే నని నాకు తెలుసు.

పిల్లలు చదువులు ముగించుకుని ఉద్యోగాల్లో చేరిన తర్వాత అయినా ఆవిడ పద్ధతి మారుతుం దేమో అనుకున్నాం. కాని, వూహూ. ఆమెకు డబ్బు యావ మరింత పెరిగింది. జీతాలు తెచ్చి తన కియ్యమంది. మొగుడు విన్నంత మాత్రాన పిల్లలు వింటారా! అందునా ఈ కాలపు పిల్లలు! ఆమె ఐరన్ కర్టెన్‌ని చీల్చుకుని వాళ్ళు మోడర్న్‌గా తయారయ్యారు. 'వయా పైసా ఇవ్వం పో' మన్నారు. ఆమె మామయ్యకు పురెక్కించడానికి ప్రయత్నించింది. బాధ్యతలు తగ్గి, వయసు పెరిగి, విరక్తి కూడా తారస్థాయికి చేరుకుని కాస్త ధైర్యంగా ప్రవర్తించటం నేర్చుకున్నా డేమో—'పిల్లల సంపాదన మీద ఆధార పడాల్సిన అవసరం నాకు లేదు' అని చీవాట్లేశాడు. అంతే కాదు. ఆమె కొడుకు లిద్దరూ ఉద్యోగాలు చేసే అమ్మాయిలనే పెళ్ళిళ్ళు చేసుకున్నారు. ఆదాయం పెరిగింది. అది ఆవిడకు మరింత కన్నెర్ర.

మరో రెండేళ్ళకు మామయ్యకు ప్రమోషను వచ్చింది. ఒకప్పటి స్టెనోగ్రాఫర్ ఆఫీసు మారరించెండెంటై బ్రాంచి మేనేజర్ రీజినల్ మేనేజరై తన ఇనిషియల్సూ, తన హోదా ఒక్కటి చేసుకుంటూ ఎ. జి. ఎమ్. అయ్యాడు. కాని అత్తయ్య మాత్రం మారలేదు.

ఆయన హోదాలో బ్యాంకు వాళ్ళు ఆయనకు ఫర్నిచర్ అలవెన్సూ, ఎంటర్టెయిన్‌మెంటు అలవెన్సు కూడా ఇస్తారు. ఇంటికి ఎందరెందరో పెద్ద మనుషులు, సోషల్ ఎలైట్ వస్తారు. ఆయన్ని పార్టీలకు పిలుస్తారు. మర్యాద కోసం సతీ సమేతంగా రమ్మంటారు. కాని ఈ మహా తల్లిని తీసుకుని ఆయనెక్కడికి వెళ్ళగలడు? ఇంటికి వచ్చే గెస్టులతో ఆయన కోడళ్ళే మాట్లాడేవాళ్ళు. ఇంట్లో అప్పుడప్పుడూ చిన్న డిన్నర్లు అరేంజి చేయాల్సివస్తే అత్తయ్య గుండె బాదుకునేది. ఉద్యోగ రీత్యా అవన్నీ అవసరమని ఆమెకు తెలియదు. ఉన్నతోద్యోగులు పార్టీల్లో, డిన్నర్లలో కూడా ఆఫీసు విషయాలు మాట్లాడు కుంటారని ఆమె గ్రహించదు. మొగుడింకా పైకిలెక్కి టిఫిన్‌డబ్బా హేండిల్‌కి తగిలించుకునే పోవాలని ఆమె ఉద్దేశం.


అలవాటయిన జీవితం వల్లనో, ఆమె మీది ప్రేమవల్లనో గాని, పిల్లల సంగతెలా ఉన్నా మామయ్య ఆమె మాటలకు ఎంతో కొంత విలువ ఇస్తున్నట్టుగానే ప్రవర్తించేవాడు. కాని ఆయన స్టేటస్ తెలుసుకున్న కొడుకులు, కోడళ్ళు ఆయన కెలాంటి ఇబ్బందీ కలగకుండా చూసేవాళ్ళు.

ఆమె దురాశ కాకపోతే ఇంతమంది సంపాదన సరిపోదన్నట్టుగా ఇల్లు అద్దె కివ్వక తప్పదంటూ ఒక మడత పేచీ వేసింది ఆ మధ్యన. ఎంతమంది చెప్పినా వింటేనా! జీతం తెచ్చి తల్లికివ్వని కొడుకుల దగ్గర అద్దె ఎందుకు తీసుకోకూడదని ఆమె వాదన.

మామయ్య ఎంతో నచ్చచెప్పాడు. "ఇలానువ్వు రాద్ధాంతం చెయ్యకే. నీకేం కావాలో చెప్పుతెచ్చిపెడ్తాను" అంటూ కాని ఆమె—"ఇదంతా నాకోసమేనా చేసింది? నేను సుఖపడటం కోసమేనా ఇన్నాళ్ళు ఈ సంసారాన్ని దిద్దుకొచ్చింది?" అంటూ ఎదురు ప్రశ్న వేసింది.

"మరి నీ కోసమూ కాదు, నా కోసమూ కాదు. ఎవరి కోసం ఇంత ఆరాటం?" అన్నాడు మామయ్య.

ఇలా వాళ్ళు తమ దోరణి మార్చుకోవటం లేదని తెలిశాక అత్తయ్య దోరణి మారింది. తనను ధిక్కరించి ఇంట్లో మనుషులు ఉండగలరా? అది




ఆమె కో ఛాలెంజి.

ఇంట్లో సామాను తీసుకెళ్ళి అమ్మేసేది. ఎక్కడున్నా డబ్బు కని పిస్తే తీసి దాచేసేది. కొడుకులూ, కోడళ్ళూ సినిమాలకెడితే వాళ్ళ పిల్లల్ని దగ్గరుంచుకోవటానికి కూడా నిరాక రించేది. ఇంట్లోకి ఏమైనా అలంకరణ వస్తువులు వస్తే, వాళ్ళు ఆఫీసుల్నించి వచ్చేసరికి అవి కింద పడి పగిలి పోయి ఉండేవి.

ఓపిక పట్టలేదని కాదు. ఒక నెలా, ఒక సంవత్సరమూ—అయిదేళ్ళు ఓపిక పట్టారు వాళ్ళు.

ఒకనాడు సాయంత్రం ఎవరో ఫ్రెండ్సు వస్తున్నారు. పార్టీ చెయ్యా లనుకున్నాడు మామయ్య. అతిథులు వచ్చి ఇంట్లో కూర్చోగానే 'పాలు విరిగి పోయాయి' అంటూ చల్లగా చెప్పింది అత్తయ్య. తెల్లారి చూస్తే అందులో చింతరిక్క ఒకటి కన్పించింది. ఏమంటాడు? ఏమన్నా మళ్ళీ పోట్లాట. ముఖ్యంగా ఎవరైనా వచ్చినప్పుడు అంద రికీ విన్పించేలా లోపల్నించి ఏదో ఒకటి అరుస్తూ ఉండేది.

మర్యాదకోసమైనా మామయ్య 'నా భార్య' అంటూ పరిచయం చేయా లంటే, ఈవిడ మామయ్యకు తల వంపులు కలిగించేలా మాసిన చీరతో, జుట్టు రేపుకుని వచ్చి మొహం ముట ముటలాడిస్తూ నిల్చునేది.

మామయ్య వచ్చి ఇంట్లో అమ్మతో నాన్నతో ఈ విషయాలన్నీ చెబుతుంటే విని జాలేసింది. ఏం లాభం? అన్నీ ఉండి కూడా ఏమీ లేనట్టు బతకాల్సి వచ్చింది ఆయనకు.

వాళ్ళ ఇంట్లో మొత్తం ఎనిమిది గదులు. అందరికీ వేర్వేరు పడగ్గదులు పోగా, డ్రాయింగ్‌రూమ్, గెస్టురూం, స్టోర్‌రూం ఉన్నాయి (స్టోర్‌రూం పేరుకే గాని సామానంతా వంటింట్లోనే ఉంటుంది). ఇంతగాక మరో రెండు గదులు వెయ్యించాలని అత్తయ్య ఇటీవలి డిమాండ్.

ఆమె పోరు పడలేక మామయ్య 'సర్లే' అన్నాడు. అత్తయ్య మనసు సంతోషంతో పరవశించింది. "మేము దగ్గ రుండి కట్టిస్తాము" అంది.

ఒక నెల రోజుల పాటు పని నడిచింది. ఖర్చుకో, విచారంతోనో గాని మామయ్య చాలా మారిపోయినట్లు అనిపించింది. లోపలెంతో బాధను అణచుకున్నట్టుగా కనిపించాడు. ఇంటి వెనక భాగాన గదులు కట్టించటం పూర్తయ్యాక ఒకనాడు నమ్మల్ని ఇంటికి పిలుచుకుని వెళ్ళాడు. అప్పటికే అక్కడికి అత్తయ్య పుట్టింటి తరపున వచ్చిన ఆమె అన్నా, ఆమె పెద్ద నాన్న ఒకాయనా, మామయ్య కోడళ్ళ తల్లిదండ్రులూ, మరి కొందరు బంధు వులూ వచ్చారు.

అందరికీ టిఫిన్లూ, టీలూ అయ్యాక మామయ్య చెప్పాడు. "నా వివా హమై ఇప్పటికి సుమారు ముప్పై ఏళ్ళు కావస్తోంది. ఇన్నేళ్ళలోనూ నేను నా బరువు బాధ్యతలు నిర్వర్తిం చానో, లేదో మీరే చెప్పండి. పిల్లల్ని పెద్ద వాళ్ళనుచేసి, వాళ్ళకో దారి చూపిం చాను. ఇల్లు కట్టించాను. వీలైనంతలో అందరికీ సహాయం చెయ్యటానికే ప్రయత్నించాను. మరో మూడు నాలు గేళ్ళలో నేను కూడా రిటైరు కాబో తున్నాను. నాకు ఎవరి మీదా ఎలాంటి ఆక్షేపణా లేదు. నా భార్య నాకు ఇన్నే ళ్ళుగా సేవ చేసింది. కాదనటం లేదు. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో సంసార మన్నాక కొన్ని చెప్పుకునేవి ఉంటాయి, కొన్ని చెప్పుకోలేనివి ఉంటాయి. ఆమెతో కలిసి జీవించటంనాకు దుర్భరంగా ఉంది. ఆమెకు ఎన్నోసార్లు చెప్పాను. బతి మాలాను. పిల్లలు, కోడళ్ళు కూడా చెప్పారు. కాని ఆమె తన పద్ధతి మార్చు కోలేదు.

నాకున్న హోదావల్ల ఇంటికి ఎందరో పెద్ద మనుషులు వస్తూ పోతూ ఉంటారు. ఈమె అది చూసి ఓర్వలేక పోతున్నదని నేను కాదు— పిల్లల్నడగండి—వాళ్ళే చెబుతారు. అందు వల్లనూ, మరి కొన్ని కారణాల వల్లనూ ఆమె కోరిన విధంగానే మరో రెండు చిన్న గదులు కట్టించాను. నా భార్య ఇక మీదట అందులో ఉంటుంది. ఆమె పోషణకు మీరంతా కలిసి ఎంతివ్వ మంటే అంత ఇస్తాను. వైద్య సదు పాయం అమర్చుతాను. కాని ఇవాళ్ళలాగా ఆమెతో కలిసి ఉండటం మాత్రం ఇక నావల్ల కాదు. ఆమె నాకు చేసిన సేవలకు విలువ చెల్లించటానికి నేను రెడీగా ఉన్నాను. ఆనాడు అవసర ముండి చేసుకున్నాను. బాధ్యత కనక పోషిస్తాను. పిల్లలుకూడా సరిగ్గా అదే మాట చెప్పారు. ఒక వేళ నేను చేస్తున్న ఈ పని తప్పని మీలో ఎవ రైనా అనుకుంటే పెద్దలు మీరు నన్ను సరిదిద్దండి శిరసావహిస్తాను."

మామయ్య దాతృత్వానికి అక్కడ కూర్చున్న వాళ్ళందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.

ఇలాంటి గంపగయ్యాళికి ఇన్ని సౌక ర్యాలు ఇస్తున్నాడంటే ఇంకా ఆది వేరే ఉంచడం మాత్రం ఎలా అవుతుంది? ఆయన పరిస్థితిలో మరెవరున్నా ఆమెను తన్ని తగలేసేవాళ్ళు. మామయ్య మాత్రం తన ఉదార స్వభావంతో ఆమెకు పట్టపురాణి లాగే అన్నీ అమర్చి పెట్టాడు.

"ఒక్క ప్రాణానికి అంత డబ్బెందు, కంబమనుకున్నాం కాని ఆయనిష్టమంటే అడ్డు పడటమెందుకని వూరుకున్నాం. ఆ రోజంతా మా ఇంట్లో మామయ్యకు పట్టిన దుర్గతికి ఆయన మీది సాను భూతితో, జాలితో మా మనసు కలా వికలమై పోయింది.

అత్తయ్య మాత్రం ఆ రెండు గదుల్లో ఒకటి అద్దెకిచ్చి, ఇంకా పొదుపు చేస్తూనే ఉంది. ★